క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న డీసీపీ



కొడకండ్ల : మండలకేంద్రంలోని యోగలింగేశ్వర సహిత శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారిని గురువారం జనగామ డీసీపీ సీతారాం దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న శరత్కాల మహోత్సవాల్లో పాల్గొని పూజ చేసిన అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు గౌతంశర్మ తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

టీజేఎస్‌లో చేరిక



పాలకుర్తి టౌన్: పీడీఎస్‌యూ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు, బంజార ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భుక్య దర్గయ్యనాయక్ (జగన్) గురువారం తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ సమక్షంలో టీజేఎస్‌లో చేరారు. కార్యక్రమంలో టీజేఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిసాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



తరిగొప్పుల: వెంకట్‌తండా శివారు తండాలోని వాచ్య తండాలో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మాట్లాడుతూ ముడావత్ ఇస్రా, సేవుల, బోజ్య 19 లీటర్ల (రూ. 5,700) గుడుంబాను పట్టుకొని సరఫరా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. గుడుంబా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

బచ్చన్నపేట: గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని దబ్బగుంటపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్కల కనకవ్వ (51)కు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తన తల్లి పేరు మీద ఉన్న భూమి వాటాల విషయంలో అక్కాచెల్లెళ్ల మధ్య వివాదం తలెత్తింది. ఈ ఘటనపై మనస్తాపం చెందిన కనకవ్వ ఈ నెల 24న గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కంకల సతీష్ తెలిపారు.

పాలకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేయాలి



తొర్రూరు: పాలకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని పార్టీ రాష్ట్ర నాయకులు, బీజేపీ అభ్యర్థి లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం పాలకుర్తి బీజేపీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ప్రచార కార్యక్రమాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, రాష్ట్ర, జిల్లా నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పూసాల శ్రీమాన్, చీకటి మహేష్, రంగు రాములు, దొంగరి మహేందర్, సుంకరనేని కోటేశ్వర్ పాల్గొన్నారు.

యూసీసీఆర్ఐ అభ్యర్థులను గెలిపించాలి

హన్మకొండ: భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యూసీసీఆర్ఐ) ఎంఎల్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఇల్లందుల శోభన్‌బాబు కోరారు. తెలంగాణ శాసన సభకు జరగనున్న సాధారణ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 40 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు 'అల్పాహారం' ప్రయోజనకరం



రఘునాథపల్లి: బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి



చిల్పూరు: అల్పాహారం ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రవిబాబు

రఘునాథపల్లి: అల్పాహారం పథకంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పౌష్టికాహారం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ మండలంలోని 35 పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్‌ను ప్రారంభించామన్నారు. పేద విద్యార్థుల ఆకలి బాధలు తీర్చేందుకు ప్రభుత్వం అల్పాహారం పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకంతో పౌష్టికరమైన ఆహారం లభించడంతో శారీరక, మానసిక ఎదుగుదల సక్రమంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాకయ్య, సీఆర్‌పీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం

చిల్పూరు: మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందజేసే అల్పాహారాన్ని హెచ్‌ఎం రవిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈకార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. మొదటి రోజు ఉప్మా అందజేశామన్నా రు. ఉపాధ్యాయులు అంద్రు శ్రీదేవి, రమేష్, సరస్వతి, శోభారాణి, కల్యాణి పాల్గొన్నారు. చిన్నపెండ్యాలలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్యలు ప్రారంభించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



పరామర్శిస్తున్న వెంకటమల్లయ్యగౌడ్

రఘునాథపల్లి: గీత కార్మికుల ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని భాంజీపేటకు చెందిన గీత కార్మికుడు కన్న స్కైలాబ్ గౌడ్ ఇటీవల ఈతచెట్టుపై నుంచి పడి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. కాగా, వెంకటమల్లయ్యగౌడ్ సంఘం నాయకులతో కలిసి గురువారం స్కైలాబ్‌గౌడ్‌ను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈత చెట్టుపై నుంచి పడి గాయాలైన స్కైలాబ్‌గౌడ్‌కు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పగిడిపల్లి రాజు, కన్న రాజు, వెంకటేశ్వర్లు, కనకయ్య, యాకన్న, నర్సయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాల్లో దర్శనాల నిలిపివేత

పాలకుర్తి టౌన్/లింగాలఘణపురం: ఈ నెల 28న చంద్రగ్రహణం నేపథ్యంలో పాలకుర్తిలోని శ్రీచండికా సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో దైవదర్శనాలు నిలిపి వేస్తున్నట్లు ఈఓలు లక్ష్మీప్రసన్న, శేషు భారతి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ద్వార బంధనం చేసి ఆదివారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ, అభిషేకాలు, ఆరాధన అనంతరం తిరిగి భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తామని వారు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా వచ్చే నెల 26 నుంచి జరిగే జీడికల్ బ్రహ్మోత్సవాలకు ఆలయ ముస్తాబుకు ఈ నెల ఆరు కొటేషన్లు స్వీకరించనున్నట్లు శేషుభారతి వివరించారు.

మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం

జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ



కృష్ణప్రియ

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం అక్రమ అమ్మకాలు, గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.కృష్ణప్రియ గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి, గుడుంబా, బెల్లం, గంజాయి విక్రయం, కొనుగోళ్లపై నిఘా పెంచినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 62 గుడుంబా, 49 బెల్ట్ దుకాణాలను సీజ్ చేసి, 57 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రూ.2.77లక్షల విలువైన గుడుంబా, రూ.1.83లక్షల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఆయా కేసుల్లో రూ.2.40లక్షల విలువైన ఎనిమిది వాహనాలను సీజ్ చేశామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు'



చిల్పూరు: మాట్లాడుతున్న సింగపురం ఇందిర



నర్మెట: ప్రచారం చేస్తున్న నాయకులు



రఘునాథపల్లి: ప్రచారం చేస్తున్న గాదె రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలో బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనపై ప్రజలంతా విసుగుచెంది ఉన్నారని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌పార్టీ వైపు చూస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. ఘన్‌పూర్ మాలదాసరి యూత్ అధ్యక్షుడు, అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ రేండ్ల సమ్మయ్య, రాష్ట్ర మాలదాసరి ఉపాధ్యక్షుడు, ఘన్‌పూర్ మాలదాసరి సంఘం అధ్యక్షుడు రేండ్ల యాదగిరితో పాటు దాదాపు 50 మంది మాలదాసరి సంఘం బాధ్యులు గురువారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా నాయకురాలు నారగోని పద్మ, మాలదాసరి సంఘం నాయకులు రేండ్ల శివ, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరులకు అవకాశం ఇస్తే అభివృద్ధి శూన్యం

చిల్పూరు: అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికేతరులకు అవకాశం ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమవుతుందని, అందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని ఫత్తేపూర్, వంగాలపల్లి, నష్కల్ గ్రామాల్లో ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, ఊమ్లానాయక్, ఆరోగ్యం, వంగాల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

కొడకండ్ల: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందనే విశ్వాసాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం పెద్ద బాయితండాకు చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు వాంకుడోత్ ప్రవీణ్, యాకూబ్, యూత్ అధ్యక్షుడు మహేష్, సుధాకర్, అనీల్ తదితరులు ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

పాలకుర్తి టౌన్: మండలంలోని తిరుమలగిరి గ్రామం నుంచి సర్పంచ్ బక్క పుల్లయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ జోతి రాజు, లింగంపల్లి అశోక్, ఉప్పనూతుల స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే కష్టాలు తీరుతాయ్

నర్మెట: కాంగ్రెస్ పార్టీ గెలపుతోనే రాష్ట్రంలో ప్రజల కష్టాలు తీరుతాయని, ప్రజలు ఆదరించి అత్యధిక మెజార్టీతో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మచ్చుపహాడ్ ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని పలు తండాల్లో పార్టీ శ్రేణులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జయరాం నాయక్, మోహన్ రెడ్డి,కుమారస్వామి, పరశరాములు, యాదయ్య, రజనీందర్ రెడ్డి, బాల్ సింగ్, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం..

రఘునాథపల్లి: స్టేషన్‌ఘన్‌పూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని కుసుంబాయితండా, రామన్నగూడెం, కొత్తగూడెం, మంగళిబండతండా, మేకలగట్టు, ఆంధ్రతండా, రామరాయనిబంగ్లాలో ఆరు గ్యారంటీ పథకాలపై కాంగ్రెస్ నాయకులు ఇంటింటా కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మేకల నరేందర్, దొంగ అంజిరెడ్డి, జోగారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి



చిల్పూరు: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

చిల్పూరు: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై గడప గడపకు ప్రచారం చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ను మూడో సారి సీఎంగా చేయాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, జనగాం యాదగిరి, సుదర్శన్, గడ్డమీది వెంకటస్వామి, రాజన్‌బాబు, హరిబాబు, దామోదర్, విజయ్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు ప్రజల్లో విశేష స్పందన

బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోపై గడగడపకు చేస్తున్న ప్రచారంతో ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ సరితబాలరాజు వేర్వేరుగా అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో గురువారం కడియం గెలుపు కోసం గడగడపకు వారు ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు లింగారెడ్డి, రాజ్‌కుమార్, కొంగరి రవి, రజిత,పుట్ట అంజనీదేవి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

లింగాలఘణపురం: మండల కేంద్రం, నాగారం, కొత్తపల్లి, వడిచర్ల, జీడికల్, గుమ్మడవెల్లి, మాణిక్యాపురం, కుందారం, వనపర్తి, నేలపోగుల గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లిలో జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల పరిపాలనలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలతో నేడు గ్రామాల్లో అపూర్వ స్వాగతం పలుకుతున్నారని అన్నారు. ప్రచార కార్యక్రమాల్లో జీడికల్‌లో వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు గణపతి, స్రవంతి, రాజు, ఎంపీటీసీలు రాజిరెడ్డి, సిద్దు, మాజీ జెడ్పీటీసీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

రఘునాథపల్లి: కడియం శ్రీహరి గెలుపు కోసం గురువారం మండలంలోని ఇబ్రహీంపూర్, మాధారం, దాసన్నగూడెం, ఖిలాషాపూర్, రామరాయనిబంగ్లా, గబ్బెట, కంచనపల్లి, కోడూర్ గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బొల్లం అజయ్, నామాల బుచ్చయ్య, మల్కపురం లక్ష్మయ్య, దైద ప్రభాకర్, మాలోత్ నర్సింహ, దుబ్బాక హరీష్‌గౌడ్, జేరిపోతుల మహేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫేస్టోతో ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపు కోరుతూ తమ్మడపల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎ.బ్రహ్మారెడ్డి మాట్లాడారు.

'కడియం' గెలుపు ఖాయం



మాట్లాడుతున్న బెలిదె వెంకన్న గుప్తా

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని గెలిపించాలని కోరుతూ మండలంలోని తానేదార్‌పల్లిలో బెలిదె వెంకన్నగుప్తా ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు విస్తృత ప్రచారం చేపట్టారు. సర్పంచ్ గాదె చంద్రయ్య, గ్రామ రైతు కోఆర్డినేటర్ దుంపల పద్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో..

జిల్లా నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. పొన్నం నాగరాజు, నీల పరశురాములు, పొన్న రాజయ్య, కుంభం గణేష్, శేఖర్, అనీల్, నరేష్, సాయిరాజ్, కుమార్, అన్నమయ్య పాల్గొన్నారు.

'పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారు..'

నర్మెట: స్వార్థప్రయోజనాల కోసం కొందరు నాయకులు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని కాంగ్రెస్ యూత్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాంచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మచ్చుపహాడ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీ అధికారంలో లేకున్నా ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పార్టీకి సేవలందిస్తూ జెండా మోస్తూ, ప్రజా సమస్యలపై పోరాటం చేసారని అన్నారు. ప్రభుత్వ ఒత్తిడులను తట్టుకుని రాస్తారోకోలు, ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు యువతకు రైతులకు న్యాయం జరిగేలా పోరాటాలు చేశామని తెలిపారు. కార్యకర్తలను, నాయకులను అవసరానికి వాడుకున్న కొందరు నేతలు ఎన్నో పదవులను అనుభవించి పూటకో పార్టీ మారుతూ ప్రజావిస్వాసాన్ని కోల్పోవడమే కాక ఘన చరిత్ర కలిగిన కాంగ్రెను వీడిపోవడం స్వార్థప్రయోజనమేనని, ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని ఎద్దేవా చేశారు.


లేబర్ కార్డును వినియోగించుకోండి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ కవిత తదితరులు

బచ్చన్నపేట: అర్హులు లేబర్ కార్డులు పొంది దాని ద్వారా లభించే సేవలను వినియోగించుకోవాలని బండనాగారం సర్పంచ్ శివరాత్రి కవితరాజనర్సు అన్నారు. గురువారం గ్రామంలో లేబర్ కార్డు ఉన్న వారికి లేబర్‌ఆఫీస్ తరుపున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా సీఎస్‌సీ హెల్త్ కేర్ వైద్యులు 50 రకాల పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కార్డు దారుడికి రూ. 10 వేల విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే అవసరమున్న వారికి ఉచిత మందులను కూడా అందిస్తారని తెలిపారు. గ్రామంలో అందరూ వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. గ్రామస్తులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



డప్పులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కమలాకర్‌రెడ్డి

నర్మెట: కళాకారులను ప్రోత్సహించి కళలకు జీవం పోయాలని నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన అంబేడ్కర్ యూత్ డప్పు కళాబృందం సభ్యులు 20 మందికి డప్పులు, గజ్జెలు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగున పడిపోతున్న కళలకు జీవం పోయడంతోపాటు కళాకారులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు జంగిటి అంజయ్య, యూత్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దేవరుప్పుల: కవాతులో పోలీసులు



రఘునాథపల్లి: కవాతులో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి తదితరులు

దేవరుప్పుల: శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ అన్నారు. గురువారం మండలంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటుచేసుకోకుండా కేంద్ర పోలీసు బలగాలు చేరాయి. ఈ సందర్భంగా దేవరుప్పుల, కామారెడ్డిగూడెం గ్రామాల్లో పోలీస్ బలగాలు జాతీయ జెండాలు చేతబూని ఆయుధాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో పూజారి ఉప్పల రమేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి అసిస్టెంట్ కమాండెంట్ బిపిన్ జైస్వాల్ తదితరులను ఘనంగా సన్మానించారు. పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, స్థానిక ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్, కొడకండ్ల ఎస్సై శ్రవణ్‌కుమార్, ఎస్సై సదానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రఘునాథపల్లి: ప్రశాంతగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకు గురువారం మండలంలోని రఘునాథపల్లి, నిడిగొండలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎన్నికల నియమావళికి లోపడి నడుచుకోవాలన్నారు. ఎలాంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘునాథపల్లి, లింగాలఘణపురం ఎస్సైలు చాగర్ల రఘుపతి, ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలు గుణపాఠం చెబుతారు

- ఓటమి భయంతో పౌరసత్వానికి ఎర్రబెల్లి అడ్డంకులు
- కాంగ్రెస్ సంకల్పయాత్రలో హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



పెద్దమడూరులో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల: తన పౌరసత్వాన్ని అడ్డుకుంటూ కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావుకు పాలకుర్తి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని పెద్దమడూరు, ధారావత్‌తండా, ధర్మగడ్డతండాలో నిర్వహించిన కాంగ్రెస్ సంకల్పయాత్రలో ఆమె మాట్లాడారు. తాను 40 ఎళ్ల అమెరికా సామ్రాజ్యాన్ని వదిలి పుట్టిన గడ్డలో ప్రజా సేవ చేయడానికి వస్తే గిట్టని దయాకర్‌రావు.. ఎన్నికల్లో గెలువలేక బీజేపీతో చేతులు కలిపి సాంకేతిక కారణాలు చూపుతూ తన పౌరసత్వాన్ని అడ్డుకునే యత్నాలతోనే ఓటమిని అంగీకరించారని అన్నారు. పాలకుర్తి గడ్డమీద ఐదు నెలల క్రితం అడుగిడగానే కాంగ్రెస్ నీరాజనం చూసి తమ కార్యకర్తల్ని భయభ్రాంతులకు గురిచేసినా వెనుకడు వేయలేదని పేర్కొన్నారు. పౌరసత్వానికి అడ్డొస్తే యువ మహిళ తన కోడలు యశస్వినిరెడ్డిని కూడా రంగంలోకి దింపి పాలకుర్తి ప్రజలకు అంకితం చేస్తానని ప్రకటించారు. అమెరికా పోవడానికి ఇక్కడికి రాలేదు.. పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి నాన్‌లోకల్‌కు చెందిన దయాకర్‌రావును పర్వతగిరికి పంపించడం అనివార్యమని అన్నారు. స్వగ్రామమైన చెర్లపాలెంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేశామని.. దయాకర్‌రావు వాటర్‌ప్లాంట్ల కోసమని అమెరికాలో విరాళాలు వసూలు చేసి ఒక్క శాతం ఖర్చు చేయలేదని ఆరోపించారు. ఒక్కసారి మాకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని చెప్పారు. ఎర్రబెల్లి పరోక్షంగా పాల్పడుతున్న బెదిరింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పెద్ది కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, వంగ దశరథ, నరేష్, సజ్జన్, దామెర అనిల్, ప్రదీప్ పాల్గొన్నారు.